క్లుప్తంగా

6, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్

రాజానగరం: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 6, 8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. పీఓ, ఏపీఓలకు 6న, ఓపీఓలకు 8న ఓటు చేసే అవకాశం ఉందని సహాయ రిటర్నింగ్ అధికారి రెహమాన్ తెలిపారు. పోలీసు సిబ్బందికి మాత్రం రాజమహేంద్రవరంలో 8న పోస్టల్ బ్యాలెట్ వేయవచ్చన్నారు. ఎన్నికల నిర్వహణకు 460 మంది పీఓ, ఏపీఓలను, 904 మంది ఓపీఓలను నియమించగా, వీరిలో పీఓ, ఏపీఓలకు 6న, ఓపీలకు 8న పాలచర్లలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు.


సారా స్థావరాలపై ఎస్ఈబీ దాడులు



ఈలకొలనులో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ బృందం

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పిట్టా సోమశేఖర్ ఆదేశాలతో దాడులు జరిపి, జి.దొంతమూరు గ్రామంలో సారా తయారు చేస్తున్న దుంగెల్ల సత్యనారాయణను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దొడ్డిగుంట గ్రామంలో సడే నటరాజ్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. ఈలకొలను గ్రామంలో అంచూరి వెంకన్నను అరెస్టు చేసి, అతని వద్ద 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆయా దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై జి.అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎంపీలు, ఆర్ఎంపీల సేవలు ప్రశంసనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

కంబాలచెరువు: బీఎంపీ, ఆర్ఎంపీలు నిత్యం ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రౌతు తాతాలు కళ్యాణ మండపంలో శుక్రవారం బీఎంపీల ఆత్మీయ సమావేశం జరిగింది. డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయాన్ని అందించిన జగనన్నను మనమంతా మద్దతు తెలపాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

జగన్‌కే నాయీ బ్రాహ్మణుల మద్దతు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని నాయీ బ్రాహ్మణులందరూ టీడీపీకే ఓటు వేస్తారని ఆ పార్టీలోని ఒక సంఘీయుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయీ బ్రాహ్మణ నాయకులు అందనాపల్లి సత్యనారాయణ, చిట్టాబత్తుల నాగబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాయీ బ్రాహ్మణులను బెదిరిస్తూ మాట్లాడడం మరిచిపోలేదన్నారు. సీఎం జగన్ తమ సామాజికవర్గ అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేశారన్నారు.

410 లీటర్ల సారా స్వాధీనం



సారా సీసాలు, నిందితుడితో ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ

రాజమహేంద్రవరం రూరల్: సౌత్ స్టేషన్ పరిధిలో సెబ్ అధికారులు శుక్రవారం విస్తృత దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ మాట్లాడుతూ దాడుల సందర్భంగా మూడు కేసులు నమోదు చేసి, 410 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 4400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు. రాజానగరం మండలం సూర్యారావుపేటకు చెందిన మార్గాని చింతలయ్య ప్రసాద్, రాధేయపాలేనికి చెందిన గిసాల సురేష్, గోకవరం మండలం పెంటకోట గ్రామానికి చెందిన లంజపల్లి శ్రీనులను అదుపులోకి తీసుకున్నామన్నారు. రూరల్ మండలం పిడింగొయ్యికి చెందిన ఎర్ర మణికంఠ, రాజానగరం మండలం రఘునాథపురానికి చెందిన కటకం ఏసు పరారీలో ఉన్నారన్నారు.

అమ్మ ఒడి చల్లగా..

- నియోజకవర్గంలో 91,641 మంది అమ్మ ఒడి లబ్ధిదారులు
- నాలుగేళ్లలో రూ.137.45 కోట్ల మంజూరు
- తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్న ఆనందం



ఓ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పెదపూడి: చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే మహోన్నత ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. 2020 జనవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఎంతో మంది పేద పిల్లలు, డ్రాప్‌అవుట్స్ పాఠశాలల్లో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం వర్తింపజేశారు. బడికి, కళాశాలకు పిల్లలను పంపించిన తల్లుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ఏడాదికి రూ.15 వేల చొప్పున జమ చేశారు.

నియోజకవర్గంలో ఇలా..

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాలున్నాయి. ఆయా మండలాల్లో నాలుగేళ్ల కాలంలో అమ్మ ఒడి పథకంలో మొత్తం 91,641 మంది లబ్ధిదారులు నమోదయ్యారు. వారందరికీ నాలుగేళ్లలో సుమారు రూ.137 కోట్ల 45 లక్షల 90 వేల మేర నిధులు విడుదలయ్యాయి. ఆ నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం ద్వారా బడుల్లో ప్రవేశాలు గణనీయంగా పెరిగినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటి వరకూ మొత్తం లబ్ధిదారులు, వారికి జమ చేసిన మొత్తం నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	2019–2024 వరకు లబ్ధిదారులు	జమ చేసిన మొత్తం (రూ.ల్లో)
అనపర్తి	21,942	32,92,05,000
పెదపూడి	22,742	34,11,30,000
రంగంపేట	24,327	36,49,05,000
బిక్కవోలు	22,630	33,94,50,000
మొత్తం	91,641	137,46,90,000

చదువుకు అందిన సాయం



నాకు ఇద్దరు పిల్లలు. ఏడో తరగతి చదువుతున్న కుమారుడు సమ్మంగి సిద్దుకు అమ్మ ఒడి పథకం వర్తించడంతో చదువుకు అవసరమైన పుస్తకాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్నాం. నాలుగేళ్ల పాటు ఈ పథకం అందింది. దీంతో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించే స్తోమత లేని వారికి అమ్మ ఒడి పథకం ఆసరాగా నిలుస్తోంది. దీంతో ఆర్థిక భారం తప్పింది.

– సమ్మంగి వీరమణి, విద్యార్థి తల్లి, పెదపూడి గ్రామం

చాలా ఆనందంగా ఉంది



చదువులు భారంగా మారిన పరిస్థితుల్లో అమ్మ ఒడి పథకం ఏడో తరగతి చదువుతున్న నా కుమారుడు అల్లిమిల్లి సందీప్‌కుమార్‌కు నాలుగు సార్లు అందింది. పిల్లల చదువుకు అమ్మ ఒడి అందడం చాలా ఆనందంగా ఉంది. చదువుకు అవసరమైన సామగ్రి కొనడానికి ఇతర, అవసరాలకు ఈ సాయం పనికొచ్చింది.

– అల్లిమిల్లి సత్య, విద్యార్థి తల్లి, పెదపూడి గ్రామం

వెంకటాపురంలో వైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్

రంగంపేట: ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలంతా వినియోగించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి కోరారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కె.చిన్నారావు, కంటి వైద్య నిపుణులు ఎం.ఇందిర 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు, ఒకరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి కాత్యాయని, సీహెచ్‌ఓ కె. జయమణి, ఎంపీహెచ్‌ఓ పి.ప్రసాద్, పీహెచ్ఎన్ ఎల్.గంగాభవాని, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

వైఎస్సార్ సీపీ శ్రేణుల ఎన్నికల ప్రచారం



అనపర్తి పాతవూరు బాపనమ్మ గుడి వీధిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి మద్దతుగా స్థానిక పాతవూరు బాపనమ్మ గుడి వీధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాలు, వివిధ సంక్షేమ పథకాలు ఎంతో మంది నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, తిరగతి శివ, మల్లిడి గోవిందరెడ్డి, ర్యాలి కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, ఐ.విజయకుమారి, మండ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

- దేశంలోనే నంబర్ వన్ సీఎం జగన్
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



మిర్తిపాడులో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని మిర్తిపాడులో గురువారం రాత్రి పోతిరెడ్డి ఈశ్వరరావు, ఈడాల వెంకటేష్, ముప్పిడి జయరాజ్, పోలమూరి లంకయ్య, ఎం.నాగరాజులతో పాటుగా 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా బలపడటానికి సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. దేశంలోనే నంబర్ వన్ సీఎంగా జగన్ నిలిచారన్నారు. ప్రతిపక్ష పార్టీల గుండెల్లో గుబులు ప్రారంభమైందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల వలే పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, పార్టీ నాయకులు జొన్నలగడ్డ సత్యనారాయణ, ఏకరాజు, మాకిరెడ్డి సాయి కళ్యాణ్, పోతిరెడ్డి వినాయకరావు, నల్లా శ్రీను, జొన్నలగడ్డ సత్య పాల్గొన్నారు.

పింఛన్ అవస్థలకు చంద్రబాబే కారణం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కోరుకొండలో ఎన్నికల ప్రచారం



కోరుకొండలో ఎమ్మెల్యే రాజాను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

మధురపూడి: పింఛన్ తీసుకోవడానికి లబ్ధిదారులు పడుతున్న అవస్థలకు టీడీపీ అధినేత చంద్రబాబే కారణమని, ఆయన వల్లే అవ్వాతాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన శుక్రవారం కోరుకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్యాన్ గాలి జోరుగా వీస్తోందన్నారు. రాజానగరం నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 20,170 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశామని, ఆర్బీకేల రైతన్నలకు అండగా నిలిచామన్నారు. అలాగే రూ.1,770 కోట్లతో అభివృద్ధి, మరో రూ.1,370 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు జరిపామన్నారు.

ఆత్మీయ స్వాగతం

స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి ప్రచారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే రాజాకు అక్కచెల్లెమ్మలు హారతులతో, నాయకులు పూలమాలలతో స్వాగతం పలికారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. బస్టాండు సెంటర్‌లో ఆయనను గజమాలతో అభిమానులు సత్కరించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి పాత చేపల మార్కెట్, విఘ్నేశ్వరుని ఆలయం, సచివాలయం, బస్టాండ్, మెయిన్ రోడ్డు, కాపవరం సెంటర్, అంకాలమ్మ ఆలయం, శివాలయం మీదుగా ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసయ్య, తిరుమలశెట్టి సత్యనారాయణ, గొల్లపల్లి ప్రవీణ్, కాళ్ల వీరబాబు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, బొరుసు బద్రి, పైడిమళ్ల ధనరాజ్, తాతపూడి చక్రవర్తి పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుందాం



సీతానగరం ఎస్సీపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేద్దాం, మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం అంటూ వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీతానగరం ఎస్సీపేటలో శుక్రవారం జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు, చీపురుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్నెల్లి వెంకట్రావు, చినకొండేపూడి సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, చిడిపి దావీదు, కొల్లి చిరంజీవి తదితరుల ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో పలు సంక్షేమ పథకాల ద్వారా అందజేసిన లబ్ధిని వివరించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా నగదు పొందారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాలను సీలింగ్ ఫ్యాన్‌పై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

శ్రీకృష్ణపట్నంలో డాక్టర్ రాజశ్రీ ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: ఎమ్మెల్యే జక్కంపూడి రాజా భార్య డాక్టర్ రాజశ్రీ శుక్రవారం రాత్రి శ్రీకృష్ణపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి, సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు చేసి, జగనన్నను మరోసారి సీఎంని చేయాలని విజ్ఞప్తి చేశారు. గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులను, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఇవన్నీ కొనసాగాలంటే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలన్నారు. ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా, ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు.

కడుపు మంట చల్లారిందా బాబూ?

- అవ్వాతాతల ఆవేదన
- పింఛన్ తీసుకోవడానికి అవస్థలు
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు



పింఛన్ సొమ్ముల కోసం కస్టమర్ సర్వీస్ సెంటర్ వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు

సీటీఆర్ఐ: జగన్ అధికారంలోకి వచ్చాక సూర్యుడు ఉదయించకముందే పింఛన్ లబ్ధిదారుడి ఇంటికి వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్మును పంపిణీ చేసేవారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ల ద్వారా అర్హుల ముంగిటకు చేరేవి. ప్రతి నెలా ఒకటో తేదీనే 90 శాతం పైగా పింఛన్లు పంపిణీ దిగ్విజయంగా అందేది. అవ్వాతాతలు, వృద్ధులు, వికలాంగులకు ఏ ఇబ్బంది కలగకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా పింఛన్‌ను పంపిణీ చేసేవారు. ఈ వ్యవస్థపై ఆది నుంచి టీడీపీ నాయకుల అసూయ పెంచుకున్నారు. రోజు రోజుకీ వలంటీర్లు ప్రజలకు చేరువ కావడంతో తలలు పట్టుకున్నారు. చివరకు తెలుగుదేశం, జనసేన నాయకులు వలంటీర్లపై అనైతిక ఆరోపణలు చేశారు. చివరకు ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకుని వలంటీర్లను పింఛన్ పంపిణీకి దూరం చేశారు. దీంతో అవ్వాతాతలు, ఇతర లబ్ధిదారులకు అవస్థలు మొదలయ్యాయి.

మూడో తేదీ వచ్చినా అందని పింఛను

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా మే నెలలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో పింఛన్ సొమ్ము జమ చేయడంతో అది కాస్తా భారంగా మారింది. అవ్వాతాతలు బ్యాంకుల చుట్టూ తిరగలేక అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ అందుకునే వాళ్లందరూ ఇప్పుడు 3వ తేదీ వచ్చినా నగదు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులలో రద్దీ ఎక్కువగా ఉండటంతో కమిషన్ తీసుకుని డబ్బులు ఇచ్చే సెంటర్ల వద్దకు వెళుతున్నారు. ఎందుకిలా పగ తీర్చుకుంటున్నావ్ చంద్రబాబూ.. మీకు మేము ఏం ద్రోహం చేశామని ఆవేదన చెందుతున్నారు.

ఉచిత ప్రయాణంపై ఆటో కార్మికుల నిరసన



ఆటో కార్మికుల నిరసన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీపై ఆటో కార్మికులు నిరసన తెలిపారు. తమ జీవనోపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో నగరంలో ఆటోలతో నిరసన ర్యాలీ చేశారు. క్వారీ సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ వరకూ కొనసాగింది. సుమారు 500 ఆటోలతో డ్రైవర్లు, యజమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ఆటో కార్మికులకు మద్దతు పలికారు. క్వారీ సెంటర్ వద్ద నిరసన ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారన్నారు. తమ ఉపాధిని దెబ్బతీస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు గెలవకుండా రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది ఆటో కార్మికులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

సీట్ల కేటాయింపులో బీసీలకు అగ్రస్థానం



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: ఉభయ గోదావరి జిల్లాలలో అత్యధిక జనాభా ఉన్న బీసీ సామాజిక వర్గానికి సీట్ల కేటాయింపులో సీఎం జగన్ అగ్రతాంబూలం ఇవ్వడం హర్షణీయమని, వారిని గెలిపించుకోవడానికి ఐక్యంగా కృషి చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్, శెట్టిబలిజ సంఘ నాయకుడు వాసంశెట్టి గంగాధర్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్గాని మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 11 పార్లమెంట్, 48 అసెంబ్లీ స్థానాల్లో బీసీలు పోటీచేస్తున్నారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన పూలే అడుగుజాడల్లో నడుస్తున్న జగన్‌కు బీసీలు అండగా నిలవాలన్నారు. వాసంశెట్టి గంగాధర్ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు ఎంపీ సీటు, భరత్ రామ్‌కు సిటీ, మంత్రి వేణుకు రూరల్ స్థానాలను కేటాయించడం అభినందనీయమన్నారు. వీరిని గెలిపించుకోవడానికి అందరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకులు కడియాల శ్రీనివాస్, కదలి వెంకటేశ్వరరావు, గుత్తుల మురళీధర్, పెంకే సురేష్, రేలంగి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

భ్రూణ హత్యలపై అవగాహన కల్పించాలి



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: భ్రూణ హత్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు అన్నారు. బొమ్మూరులో జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం యూపీహెచ్‌సీల ప్రోగ్రామ్‌లపై ఆయన సమీక్షించారు. జిల్లాలోని 15 యూపీహెచ్‌సీల పనితీరుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. యూపీహెచ్‌సీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్, సమ్మికుమార్, సీహెచ్‌వో శర్మ, సూపర్ వైజర్ ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.